మువ్వలు

- భమిడిపాటి జగన్నాథ రావు

సరళ అతన్ని చూస్తోంది.
తను రెండు నిమిషాలుగా అతనినే చూస్తున్నానని తెలిసి, కళ్లు దించింది.
ఎదురుగా చిన్న కంప్యూటర్.
పెద్ద గది. చలిగాలేదు. చల్లగా ఉంది.
ఆ పెద్ద గదిలో వాళ్లిద్దరే ఉంటారు. గది వెనకగా ఓ ఫైలింగ్ కేబినెట్, చిన్న స్టీల్ ఆల్మైరా. విడిగా రెండు కుర్చీలు. ఇంకో ఫర్నీచర్ కాని, ఇతర వస్తువులు కాని ఇంకేమీ లేవు. శబ్ద కాలుష్యం తగలని గది.
ఆ గది అంతా మళ్ళా ఓసారి చూసి, ఆమె అతనిని మళ్ళా ఓ సారి చూసింది.

కుడి చెంపన బాల్‌పాయింట్ పెన్ గుచ్చి, దీక్షగా, తదేకంగా, అతను గ్లాస్ టాప్ టేబిల్ మీద పరుచుకున్న 'బ్లూ ప్రింట్స్' చూస్తున్నాడు.
అతను తన పనిలో శ్రద్ధగా అలా ఉండడం ఆమెకు ముచ్చటగా ఉంది.
అతను లేచి నిలుచున్నాడు. ఆరు అడుగుల పైన, పొడవైన అతని పొడువు ఎబ్బెట్టుగా ఉన్నట్టుగా ఉంటుంది. నడుము పై భాగం వంగినట్టుగా ఉండి కాస్త గూనిలా అనిపిస్తుంది కాని, కాదు. మనిషి నలుపు. కాస్త పొడవైన ముక్కు. అతని ముంజేతులు, మగవాడి చేతుల్లా, మోటుగా ఉంటాయి. మరీ గుబురు మీసాలు. సరిగా దువ్వుకోని, దువ్వినా లొంగని జుట్టు.
అతను నుంచునే, చెంపన అరచేయి ఆన్చి, ఇంకోసారి ఆ బ్లూ ప్రింట్స్ ఆకుపచ్చ పిల్లి కళ్లతో చూస్తున్నాడు. అతని వత్తైన కనుబొమల కింద ఆ ఆకుపచ్చ కళ్లల్లో కదలిక లేదు. చూపు అంతా టేబిల్‌పై ఉన్న డ్రాయింగ్స్ మీదే.
పనిలో ఉన్నప్పుడు పరిసరాలేవీ అతన్ని తాకవు. పనిచేస్తున్నప్పుడు అతని ఏకాగ్రత ఆమెకు ఇష్టం. ఆమె ఆ ఇష్టం కాని, ఆమె ఇతర ఇష్టా, ఆలోచనలు కాని అతనికి తెలియవు. అతను ఎక్కువగా మాట్లాడడు. ఇక ఆమె లోకం ఆమెది. అతని ముభావం, సీరియస్‌గా ఉన్నట్టు ఉండడం ఆమె చాలా మామూలుగా తీసుకుంటుంది.
ఉన్నట్టుండి ఆ మూడు బ్లూ ప్రింట్స్ చాలా నీట్‌గా అందుకుని, కుర్చీ నెమ్మదిగా వెనకకు జరిపి, చప్పుడు చేయని 'షూస్'తో నడుస్తూ, అతను గది గుమ్మం తెరచి, మూసి, మాయమైపోయాడు.
ఆమెకు పక్కున నవ్వొచ్చింది. పలువరస తెల్లగా, ముద్దుగా మెరిసింది.
అతను వెళ్లిపోగానే సరళ చాలా ఒంటరి అయిపోయినట్టు అయిపోయింది.
'టూ ఈజ్ కంపెనీ' అనుకొని మళ్లా నవ్వుకొంది.
సరళ అమ్మను తలుచుకుని ఉల్లాసంగా అయింది.
ఆమెకు అమ్మ, అమ్మమ్మ - ఇద్దరే ఉన్నారు. అమ్మమ్మ వాళ్ల ఊళ్ళో. అమ్మ తన దగ్గర.
సరళ తండ్రి పద్దెనిమిది ఏళ్ల క్రితం - ఆమె అయిదో ఏట - సడెన్‌గా పోయేడు. 'మాసివ్ హార్ట్ ఎటాక్'. అమ్మ, అమ్మమ్మల దగ్గర పెరిగింది.
ఉన్న ఒక్క మేనమామ పధ్నాలుగు ఏళ్లనాడు - భార్యను, ఇద్దరు ఆడి పిల్లలను తీసుకుని 'అస్సాం' వెళ్లిపోయాడు - ఉద్యోగం కోసం. ఉద్యోగం చేస్తూ, భార్య పిల్లల సహకారంతో - ఓ చిన్న స్కూలు నడుపుతున్నాడు.... టీ తోటల్లో పనిచేసే వాళ్లకు, వాళ్ల పిల్లలకు చదువు చెబుతూ, వాళ్లల్లో ఒకే కుటుంబంగా కలిసి పోతూ, ఆ దూరం అమ్మను, ఆమె తమ్ముడిని చాలా దూరం చేసేసింది. రెండేళ్లకో చిన్న ఉత్తరం. సంవత్సరానికో 'శుభా కాంక్షల' గ్రీటింగ్.
వాళ్ల కుటుంబానికి దగ్గర బంధువులు చాలా తక్కువ. నాన్న, మావయ్య దూరమైపోయి, అమ్మమ్మ, అమ్మ నీడలో సరళ ఆడుకుంటూ, పాడుకుంటూ, చదువుకుంటూ పెరిగింది.
వాళ్ల ఊళ్లో పెంకుటిల్లునూ, ఇంటి వెనకాల పెరడునూ, ఇంటి ముందు స్థలాన్నీ ఆమె అమ్మమ్మ శుభ్రంగా, పూల సువాసనలతో, చెట్ల పచ్చదనంతో హాయిగా ఉంచేది. సరళ అమ్మ, అమ్మమ్మ ఒకే నాణెంలో ఒదిగిన బొమ్మ, బొరుసులా కలిసిపోయి ఉండే వారు - ఆలోచనలో, బతుకులో. ఆ తల్లీ కూతుళ్లు ఇద్దరూ కలిసి హాయిగా పాటలు పాడుకునేవారు.
సరళ తల్లి - సంధ్య ఆమె పేరు - కూతురికి... ఇద్దరికీ తెలియకుండానే - చాలా విషయాల గురించి ఆలోచించడం, అనుభూతం చేసుకోవడమే కాక అనుభవంలో ఇమిడిన సత్య దీప్తి తాలూకు వెలుగు... ఈ అన్నిటితో నిండిన సుదూర మార్గం చివర అందుకునే లో వెలుగు - వీటన్నిటినీ గురించి చెప్పేది. తెలిసీ తెలియని వయస్సులో అన్నిటినీ అర్థం చేసుకోలేక, తన చిన్న కూతురు బిడియంతో నవ్విన నవ్వుల్లో ఆ తల్లి కూడా నేర్చుకుంది.
ఉదయపు అందాలను, సాయం సంధ్యలను, వెన్నెల వెలుగుల్నీ, చీకటి రాత్రులను, చెట్లలోని ఆకుపచ్చతనాన్ని, ప్రాణవంతమైన గాలిలోని హాయినీ, జీడి మామిడి తోటల్లోని చిన్న వెగటుతో కూడిన మత్తు సువాసనలను, లోకం, లోకుల పోకడలను - ఆ తల్లి తన కూతురుకు కనుపింపజేసి, ఆలోచింపజేసి, అనుభూతి సాంద్రతలో నిండిన లోతులను, వెలుగులను, దుఃఖజ్వాలలకు దగ్గర జేసింది.
సాహిత్యాన్ని, ఇంద్రియ చలనాలని, సంగీతాన్ని, నాద సుధా పారవశ్యాన్ని, ప్రకృతిని, తల్లి వడిలో పెరిగే చంటిపిల్ల తనాన్ని, భూమిని, సారవంతమైన ఆలోచనలను, మనసును, ఆరోగ్య వంతమైన మానసిక ఆరోగ్యాన్ని, భావాన్ని, భాషను, దుఃఖ బీభత్సాన్ని, కరుణను, ప్రేమను - ఈ జీవితంలో ఎలా దగ్గరకు తీసుకోవాలో... ఆమె తల్లి సరళకు - బెత్తం పట్టుకున్న మేడమ్‌లా కాకుండా - పాపకు స్తన్యం అలవాటు చేసిన తల్లిలా - నేర్పింది.
అమ్మ జ్ఞాపకాలు తనలో

తిరుగాడుతుంటే, సరళకు చల్లని ఆ పెద్దగదిలో - తను మరీ ఒంటరి అయిపోయినట్టుగా... బెంగగా, కడుపులో జాలిగా ఉన్నట్టుగా అయిపోయింది.
ఈ ఒంటరితనంలో, ఒంటరి తనం అన్న భావన లోంచి, జనం మధ్య లో ప్రకృతి వడిలోకి, జీవితపు ఉరవడిలోకి వెళ్లాలనిపించి - సరళ - టేబిల్ డ్రాయర్ తెరచి, తన 'బౌండ్ బుక్' తీసుకుని, బుక్ తిరగవేస్తూ - చైతన్య స్రవంతిలో ఉన్నట్టుగా, మునిగి, తేలి ఆడింది.
ఆ పుస్తకంలో ఆమె వేసుకున్న పెయింటింగ్స్, రాసిన కవితలు, కథలు, కీర్తనలు, పాటలు, గేయాలు - వాటి నోటేషన్స్‌తో - అన్నీ కలిసి ఉన్నాయి.
కొన్ని పేజీలు తిప్పి తన 'డ్రా' చేసిన ఇల్లు, లోపలి గదులు, వెలుగు, పెరటిలోని మొక్కలు, తీగలు, పూలతీగలు, విరియబోతూ ఇంకా ముకుళించికొని ఉన్న పూల ముద్దతనం - అన్నీ చూసుకుంటూండడం ఆమెను ఉల్లాసపరిచింది.
ఆమె ఆకృతి ఇచ్చిన ఆ ఇంటిలో - సద్దడానికి పెద్దగా సామానులేవీ లేవు. ఇంటిలోపల చల్లదనం, వెలుగు, శాంతి నిండాలంటే ఏవి ఉండాలి అని ఆలోచించడం కంటే, ఏవి ఉండకూడో తెలుసుకోవడం ముఖ్యం అనీ - అదే 'ఇంటీరియర్ డెకరేషన్'కు - జవం, జీవం అని ఆమె నమ్మకం.
తను సగం సగం రాసి వదిలేసిన అసంపూర్తి కవితలూ, రచనలు - జీవిత అవిచ్ఛిన్నతను సూచిస్తాయని ఆమె ఆలోచన.
'అవునా?! లేక అది తనలోని అసంపూర్ణతకు చిహ్నాలా? ఏమో!' అనుకొని నవ్వుకుంది. ఆ ఒంటరి గదిలో ఆమె నవ్వులోని సాంద్రత ఆ గదినంతటినీ అలుముకుంది.
ఎదురుగా ఎవరో ఉన్నట్టు అనిపించి, కళ్లు ఎత్తి చూసింది.
' ఎమ్.డి. గారు ఓ సారి మిమ్మల్ని రమ్మన్నారండి...'' అన్నాడు బ్లూ పేంట్, షర్ట్‌లో ఉన్న ఆఫీసు బోయ్.
'సరే' అని, సరళ అన్నీ నీట్‌గా సర్ది, లేచి, గది తలుపు మూసి, మూసివేసిన తలుపు వెనకాల ఉన్న గదిని తల్చుకుని ' ఆ గది మరీ ఒంటరిదా?' అనుకుని చిరునవ్వు నవ్వుకుంటూ ఎమ్.డి. రూమ్‌లోకి ప్రవేశించబోతూ, తలుపుపైన ఉన్న 'నేమ్ ప్లేట్' పై ఉన్న నారాయణస్వామి అన్న పేరు చదువుతూ ఆగింది.
సరళ పనిచేస్తున్నీ ఈ 'ఫర్మ్' కుటుంబ వ్యవహారం. తండ్రీ నారాయణ స్వామి - ఎమ్.డి., కొడుకు 'మధుసూదన్' జి. ఎమ్. తండ్రీ కొడుకులు ఇద్దరూ క్వాలిఫైడ్ ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్స్. చదువు, సంస్కారం, అభిరుచి ఉన్న వాళ్లు. ఇళ్లకు, హాస్పటల్స్‌కి, ఫేక్టరీలకి, హోటళ్లకు - కొత్తగా, అందంగా, విశాలం అనిపించేట్టు 'ప్లాన్స్' తయారుజేసి, నిర్మాణం చేపడతారు. ఈ ఫర్మ్‌కు దేశంలో చాలా మంచి పేరు, ఖ్యాతి ఉంది.
ఇక్కడ సరళ 'ఇంటీరియర్ డెకరేషన్' విభాగానికి ఇన్‌ఛార్జి. కట్టిన ఇళ్లల్లో, హాస్పటల్స్‌లో, ఫేక్టరీలలో - లోపలే కాకుండా, బయట ఉన్న ప్రదేశాలలో కూడా- కంటికి ఇంపుగా, చల్లగా, ప్రకృతికి దగ్గరగా 'ప్లాన్' చేసి శాంతి నిలపాలన్న సరళ ఊహను - తండ్రీ కొడుకులిద్దరూ - ఆలోచించుకుని - ఒప్పుకున్నారు.
సరళ గది లోపలికి వెళ్లేసరికి, స్వామి గారు నెమ్మదిగా ఫోన్‌లో, తనలోకి మాట్లాడుకుంటున్నంత నెమ్మదిగా, మాట్లాడుతూ, ఆమెను కూచోమన్నట్టు కళ్లతో సంజ్ఞ చేస్తూ, ఫోన్ పెట్టేసి, 'సారి' అని సరళ వేపు జరిపి, చూపించేరు.
చూపించి 'ఈ రెండు భవనాలకు లోపల, బయట ఏమి ఉంటే బవుంటుందో ఏవి ఎక్కడ ఉంటే బావుంటుందో - మీరు ఆలోచించి 'లిస్ట్' చేసి, 'డ్రా' చేసి రేపు సాయంత్రం నాలుగు గంటలకు ఇవ్వగలరా?' అన్నారు స్వామి.
ఆయన మాటలు మెత్తగానే కాకుండా, మాటల్లో సంస్కారం, ప్రవర్తనలో నిండుతనం కలిసి హుందాగానూ, ముచ్చటగాను ఉంటాయి.
ఓ బ్లూప్రింట్ చూస్తూ సరళ 'ఈ ఇంటికి అంత ఎత్తుగా ప్రహరీ గోడ అవసరమంటారా?' అంది.
'ఆయన అలా కావాలన్నారు. అలాగే అని - ప్రొసీడ్ అవుతున్నాం' అన్నారు స్వామి.
'అంత ఎత్తుగా చుట్టూ ప్రహరీ గోడ ఉంటే ఇల్లు మూసుకుపోదూ' అంది సరళ ప్రశ్న, ఆశ్చర్యం కలగలిపి.
స్వామి గారు నవ్వుతూ 'చెప్పి చూసాను. ఆయన - అదే ఆ కాబోయే ఇల్లుగలాయన - ఒప్పుకోవడం లేదు' అన్నారు.
'వారు ఇప్పుడున్న ఇంటి నెంబర్, ఎడ్రస్, ఫోన్ నెంబర్ నాకు ఇవ్వగలరా?' అంది సరళ.
కలిగిన ఆశ్చర్యాన్ని, సందేహాన్ని అదిమి స్వామిగారు 'అలాగే ఆ సమాచారం మీ రూమ్‌కు పంపుతాను' అన్నారు.
'ఏం లేదు సర్. ఇంటాయన ఆలోచన అది. ఇంటావిడితో ఫోన్‌లో ఎప్పాయింట్‌మెంట్ తీసుకుని ఆవిడను కలిసి మాట్లాడదామని. అంత డబ్బు పోసి, భవంతి లాటి ఇల్లు కట్టుకుంటూ, ఆ ఎత్తైన ప్రహరీ గోడతో మూసుకుపోయినట్టు అయిపోయే ఆ ఇల్లు వాసయోగ్యం కాకుండా చిన్న సైజు జైలులా అయిపోతే 'జీవితమంతా ఖైదీలా ఎందుకు బంధింపబడతారు?!' అని ఆవిడను అడిగి, ఆమె అభిప్రాయం కూడా తెలుసుకుందామని' అంది సరళ సీరియస్‌గా ముఖంపెట్టి.
స్వామి గారు పెద్దగా నవ్వి 'గుడ్ ఐడియా, గుడ్, గో ఎహెడ్' అన్నారు.
'రేపు ఆవిడతో మాట్లాడి ఎల్లుండి సాయంత్రం నాలుగు గంటలకు నా సలహాలతో మీ దగ్గరకు వస్తాను' అంది సరళ.
'సరే'
సరళ లేచి, ఆ గది దాటి కారిడార్‌లో నడుస్తూంటే కాస్త చిరాగ్గా, కొంచెం హుషారుగా, ఉన్నట్టనిపించింది ఆమెకు?
గదిలోకి వచ్చి కుర్చీలో కూచుందో లేదో, ఒకాయన చెప్పులు గట్టిగా చప్పుడు చేసుకుంటూ వచ్చి 'వీడేడి?' అన్నాడు.
'వీడంటే? ఎవడు?' అంది సరళ.
మా 'వాసుగాడు' అని శ్రీనివాస్ కూచునే 'సీట్' కేసి చూపిస్తూ, ఆమె ఎదురుగా ఉన్న కుర్చీని బర్రున లాగి కూచున్నాడు ఆయన.
'ఆయన బయటకు వెళ్లేరు'
'ఎప్పుడొస్తాడో అయితే వీడు'
'నాకు తెలియదు' అని తన పని చూసుకోబోతోంది.
'అది కాదమ్మాయ్. వాసుగాడు నాకు మేనల్లుడు. సొంతం కాదనుకో. నేనే వాడి మేనమామని - వరసకి'
ఇంతలో శ్రీనివాస్ గదిలోకి వచ్చి
'ఇలా ఇక్కడకు రా మావయ్యా. ఎప్పుడొచ్చావ్?' అన్నాడు.
'నీ కోసం గంటనుంచి చూస్తున్నానురా. ఇప్పటికి తమ దర్శనమైంది' అన్నాడాయన నిష్ఠూరంగా, శ్రీనివాస్ సీట్ కెదురుగా కూచుంటూ.
శ్రీనివాస్ టేబిల్ మీద ఉన్న గ్లాసులో ఉన్న మంచినీళ్లు తీసుకుని చప్పుడు చేసుకుంటూ తాగేసి 'నీకు మీ అన్నయ్య ఓ సంబంధం చూసేడురా, ఆదివారం వెళ్లి చూసుకో, నేను కూడా ఓ రెండు సంబంధాలు మీ అన్నయ్యకు చెప్పేను. మీ అన్నయ్య ఈ రాత్రి నీకు 'ఫోన్' కొడ్తానన్నాడు. నాకు ఈ ఊళ్లో పని ఉండి వచ్చాను. నీకు ఈ మాట చెప్పిపోదామని ఇటు వచ్చేను' అన్నాడు ఆయన.
శ్రీనివాస్ ఇబ్బందిగా చూస్తూ 'మావయ్యా - నీకు ఇంటి తాళాలు ఇస్తాను... ఇంటికి వెళ్లి కాస్త విశ్రాంతి తీసుకో. నా ఇల్లు నీకు తెలుసు గదా. నేను సాయంత్రం వస్తాను' అన్నాడు.
'ఇంకా నయం రోయ్! నీ బ్రహ్మచారి కొంప నాకేం వీలుగా ఉంటుంది! అయినా నాకు ఈ ఊళ్ళో నా పని అయిపోయింది. పెళ్లి సంబంధాల విషయం కూడా నీకు చెప్పేసాను. నేపోతానురా'
'అన్నయ్య నాకు ఉత్తరం రాసేడు. మొన్న ఫోన్ కూడా చేసేడు'
'అయితే ఇంకేం. నే పోతానిక. బ్రహ్మచారి ముదరకూడదురోయ్' అని తన మాటలకు తనే పగలబడి నవ్వుతూ వెళ్లిపోయాడాయన గది తలుపు 'ఢామ్మ'ని మూసేసి.
అప్పటిదాకా సరళకు తన కొలీగ్ శ్రీనివాస్‌కు పెళ్లి అవలేదన్నది తెలియదు. ఆ విషయం కాని, అతనికి సంబంధించిన మిగతా విషయాలు కానీ ఆమె ఆలోచనల్లో ఏనాడూ లేవు.
ఉన్నట్టుండి శ్రీనివాస్ 'అయామ్ సారీ. ఆయన మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టున్నాడు' అని, అప్పటికే చాలా మాటలు మాట్లాడినట్టు 'కామ్' అయిపోయాడు.
ఆమె తన పనిలోనూ, అతను తన పనిలోనూ ఆ సాయంత్రం దాకా ఉండిపోయారు.
ఆ రాత్రి ఆమెకు ఫోన్ వచ్చింది. స్వామిగారు చెబుతున్నారు 'రేపు సాయంత్రం ఆరున్నరకు మా అమ్మాయి, మా ఆవిడ మీ ఇంటికి వద్దామనుకుంటున్నారు... మీ వీలుగా ఉంటుందా?'
'ఇంట్లోనే ఉంటానండి. మా ఇల్లు...' అని సరళ అంటుండగా
'మన డ్రైవర్ రాజుకు మీ ఇల్లు తెలుసు. రేపు సాయంత్రం ఆరున్నరకు వస్తారు. ఉండనా' అని స్వామి గారు ఫోన్ పెట్టేసారు.
మర్రోజు సాయంత్రం స్వామి గారి భార్య, అమ్మాయి వచ్చేరు.
'వచ్చే ఆదివారం మా మనవరాలి పుట్టినరోజు, మీరూ, మీ అమ్మగారు తప్పక రావాలి' అన్నారు స్వామిగారి భార్య సీత గారు.
'పిల్ల వయసెంత? పేరేవిటి?'
పిల్లపేరు చెప్పి 'ఆరేళ్లు' ఇద్దరూ తప్పక రండి' అని ఆ పిల్ల తల్లి సుందరి కూడా చెప్పి 'డిన్నర్ అక్కడే' అని చెప్పి ఇద్దరూ వెళ్లిపోయారు.
మర్రోజు ఆఫీసులో స్వామి గారు చెప్పేరు 'ఆఫీస్ స్టాఫ్ అంతా కుటుంబాలతో వస్తారనీ, అంతా కలిసి ఇంట్లోనే రాత్రి భోజనాలు చేద్దాం' అని.
ఆ ఆదివారం సాయంత్రం సరళ, ఆమె తల్లి సంధ్య స్వామిగారి ఇంటికి వెళ్ళేరు. మిగతా స్టాఫ్ అంతా కుటుంబ సభ్యులతో వచ్చేరు. స్వామి గారి కుటుంబం అంతా వచ్చిన వారందరితో మర్యాదగా, ఆత్మీయంగా ఉన్నారు. చిన్ని చిన్ని ఆటలు, పాటలతో, జోక్స్‌తో అందరూ ఆ సాయం సమయం హుషారుగా గడిపేరు.
పుట్టిన రోజు జరుపుకుంటున్న పిల్ల 'సుష్మ' కేక్ కట్ చేసి ఆ ఆనందంలో ఉంది.
భోజనాలకు ముందు స్వామి గారి భార్య, ఇద్దరు అమ్మాయిలు వచ్చిన ఆడవాళ్లందరికి ఇల్లు అంతా చూపించేరు. ఆ ఇంటిలో ఏ చోట చూసినా సంపద తళుక్కుమని జిగేల్‌మని మెరుస్తోంది. ఆడవాళ్ళ ఆభరణాలన్నీ వజ్రాలతో, కెంపులతో నిండి ఉన్నాయి. ఇంట్లో ఫర్నిచర్, వస్తువులూ - అన్నీ ప్రత్యేకించి చాలా డబ్బు పోసి చేయించినవీ, కొన్నవీ అని తెలుస్తూనే ఉన్నాయి.
'మాకు ఇద్దరు ఆడపిల్లలండి. ఇద్దరూ పెళ్లి అయి సెటిల్ అయారు. ఆఖరున అబ్బాయి. పెళ్లి చేద్దామనుకుంటున్నాం' అని స్వామి గారి భార్య అమ్మతో అనడం సరళ వింది.
అందరూ ఆ సాయంత్రాన్నీ, భోజనాన్నీ 'ఎంజాయ్' చేసేరు. స్నానం చేసి, తల్లితో భోజనం చేస్తుండగా 'ఇవాళ స్వామి గారు, భార్యా మధ్యాహ్నం ఇక్కడకు వచ్చారు' అంది సంధ్య కూతురితో.
'ఇక్కడికా?' అని ఆశ్చర్యంపోయింది సరళ.
'అవును. నాకు ఫోన్ చేసి మధ్యాహ్నం నాలుగు గంటలకు వచ్చేరు'
'వచ్చి...?'
'నిన్ను వాళ్ళ ఇంటి కోడలిని చేసుకుంటారుట. నీతో చెప్పి ఆలోచించుకుని ఓ పదిరోజుల్లో చెప్పమన్నారు.'
సరళ ఓ రెండు నిమిషాలు ఆగి 'నేను నాలుగు రోజులు సెలవు పెడతాను. అమ్మమ్మ దగ్గరకు వెళ్దాం. అందరం అక్కడ మాట్లాడుకుందాం' అంది.
వాళ్ల ఊరి ప్రయాణంలో తల్లీ కూతుళ్లు అలవాలుగా చాలా విషయాలు మాట్లాడుకున్నారు - పెళ్లి సంగతి తప్ప.
ఇంట్లో అడుగుపెడుతూ 'అమ్మా - అమ్మమ్మకు విషయం చెప్పు. రేపు మాట్లాడుకుందాం' అంది సరళ.

(మిగతా 13వ పేజీలో)

121

కడుపులో గ్యాస్ తగ్గించే జాజికాయ

జాజికాయ, జాపత్రి ఇవి రెండూ, జాజికాయ వృక్షమైన 'మిరిస్టికా ఫ్రాగ్రన్స్' నుంచి వచ్చినవే. ఇది 'మిరిస్టికాసి' అనే కుటుంబానికి చెందినది. లవంగాలు, ఏలకులు వాడినట్లే, సువాసన, రుచి కోసరం ఆహార పదార్థాల్లో వాడుతారు. దీని విత్తనాలను 'నట్‌మెగ్' లేక జాజికాయ అని అంటారు. విత్తనాల చుట్టూ వున్న ఎర్రని పొరను 'మేస్' లేక 'జాపత్రి' అని అంటారు. ఈ రెండు సుగంధ ద్రవ్యం గానే మనకు తెలుసు. ప్రస్తుతం వీటి ఔషధ ప్రాముఖ్యం కూడా తెలుసుకుందాం.

జాజికాయ చెట్లు మలయా, ఇండొనేషియాలకు సొంతమైనా, మన దేశంలో కూడా పెంచుతున్నారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకలో వీటిని పెంచుతున్నారు. మనరాష్ట్రంలో అరకులోయ ప్రాంతాలు వీటికి అనువుగా వుంటాయి. రాష్ట్రంలో జాజికాయ, జాపత్రిలు నాటు మందుల షాపుల్లోనూ, సూపర్ మార్కెట్లలోనూ లభ్యమౌతుంది. దీని పెంపకం విస్తృతంగా చేపట్టనందున ధర మాత్రం చాలా ఎక్కువే.

విత్తనాల నుంచి తీసే నూనెను 'నట్‌మెగ్ ఆయిల్' అంటారు. ఇండొనేషియా శ్రీలంక నుంచి, సంవత్సరానికి 300 టన్నుల ఆయిల్ ఉత్పత్తి అవుతోంది. ఒక్క అమెరికానే మూడు వంతులు దిగుమతి చేసుకొని ఈ రెండు దేశాలకు విదేశీ మారక ద్రవ్యం సమకూరుస్తూ ఉంది.

జాజికాయలోని నూనెలో ఎన్నో పోషక పదార్థాలున్నాయి. 'మిరిస్టిన్', 'మిరిస్టిక్ ఆమ్లం' ముఖ్యమైనవి. జాపత్రిలోని నూనె పసుపు రంగులో వుండి, 'మిరిస్టిసిన్ మిరిస్టికల్' అనే పదార్థాలు కలిగి వున్నాయి.

ఆయుర్వేదంలో జాజికాయకు - తిక్త - రస, ఉష్ణ, కఫ, వాత, హారీ, లఘు, రోచన, దీపన మొదలగు గుణాలున్నట్లు, లైంగిక శక్తిని పెంపొందించేదిగాను, ఉదర సంబంధమైన సమస్యలకు, ముఖ్యంగా కడుపులో గ్యాస్ తగ్గించే శక్తి వున్నట్లు పేర్కొన్నారు.

జాజికాయ, కర్పూరి, నల్లమందు సమభాగాలుగా కలిపి, తమలపాకు రసంలో నూరి మాత్రలు చేసి (5గ్రా), రక్త విరేచనాలు, దీర్ఘకాలంగా వున్న చీము బంక తగ్గిన తరువాత, జీర్ణక్రియ క్రమ పరచడానికి ఇస్తారు. ఈ మాత్రలను 'జాతి ఫలాది గుటెక' అని అంటారు. ఆస్త్మా, కడుపు నొప్పి, తెల్ల బట్ట, ఋతు సంబంధమైన కడుపు నొప్పి, దగ్గు, నడుము నొప్పి తగ్గడానికి - జాజికాయ, గంజాయి, కర్పూరం, ఏలకులు, లవంగాలు, వెదురులోని గుజ్జు, చిత్రమూలం కలిపి తయారుచేసిన 'జాతిఫలాది చూర్ణం' తేనెలో కలిపి ఇస్తారు. జాతి ఫలాది చూర్ణం, ఆయుర్వేద ఔషధమయిన సిద్ధమఖరధ్వజం పైన పేర్కొన్న వ్యాధులకు మంచి ఔషధమని ఆయుర్వేదవైద్యుల పర్యవేక్షణలో తీసుకోవాలని 'నదేకర్ని' తన గ్రంథం 'ఇండియన్ మెటీరియా మెడికా' లో వివరించాడు.

జాజికాయ టానిక్ ఆమ్లం, వెన్న కలిపి తయారుచేసిన ఆయింట్‌మెంట్, మూలవ్యాధి పిలకలకు పై పూతగా పూస్తే, అద్భుతంగా పనిచేసి, దురద, పుండును నివారిస్తుంది.

ఇక దేశీయ వైద్య ఉపయోగాలు

జాజికాయ, జాప్రతి మసాలా దినుసుల్లో వాడడం అందరికీ తెలిసిందే. గర్భిణి స్త్రీలు, పైత్యం ఎక్కువగా ఉన్నవారు జాజికాయ జాపత్రి ఎక్కువగా వాడకూడదని అంటారు. జాజికాయ వాడిన పదార్థాలు అంటే సుఖ నిద్ర కలిగించి, కడుపులో గ్యాస్ చేరడం నిలుపుతుందని, మూత్ర సంబంధ వ్యాధులున్న వారికి ఇది చాలా మంచిదని అంటారు.

జాజికాయ, జాపత్రి, లవంగాలు, ఏలకులు, జీలకర్ర కలిపి చూర్ణం చేసి 1/2 చెంచాడు పొడిని అర్ధ గ్లాసు వేడి నీటిలో వేసి కలపి, రుచికి తేనెగాని, చక్కెర గాని కలపి తీసుకుంటే ఉదర సంబంధ వ్యాధులు, ముఖ్యంగా గ్యాస తగ్గుతుంది. అజీర్ణం, వాంతులు, కడుపు నొప్పి వున్నపుడు రోజుకు మూడు పూటలా పొడిగాని, నీటిలో కలిపి గాని తీసుకుంటే మంచిది.

-డా. యస్. వేదవతి

రీడర్, బాటనీ డిపార్ట్‌మెంట్, ఎస్.వి. ఆర్ట్స్ కాలేజి, తిరుపతి

మందుమొక్క

ఇలా చేస్తే సరి

★ తరచు చల్లటి నీళ్లతో కళ్ళను కడుగుతూ వుంటే కళ్లు ప్రకాశవంతంగా వుంటాయి.

★ కోడిగుడ్డు తెల్లసొనతో వెల్లుల్లి రేకలు నూరి కలిపి ముఖానికి రాసుకుంటే ముఖం అందంగా తయారవుతంది.

★ కాలి పగుళ్ళ దగ్గర ఆముదం పిండితో రుద్దితే పగుళ్ళు పోతాయి.

★ పెరుగు తలకు మర్దనం చేసుకొని తలస్నానం చేస్తే జుత్తు బాగా పెరుగుతుంది.

★ త్రిఫలా చూర్ణంతో పళ్లు తోముకుంటే దంత వ్యాధులు నశిస్తాయి.

★ జ్ఞాపక శక్తి పెంపొందాలంటే క్యారెట్ ప్రతిరోజూ తింటూ వుండాలి.

★ వేపాకులను, ఉల్లిపాయలను కలపి ముద్దగా నూరి వంటికి పట్టించుకొని అరగంట తర్వాత వేడి నీళ్ళతో స్నానం చేస్తే సాధారణ వ్యాధులు నశిస్తాయి.

★ ప్రతిరోజూ నారింజ రసం తాగుతూ వుంటే కంటి చుట్టూ వున్న నల్లని మచ్చలు తొలిగిపోతాయి.

★ వెల్లుల్లి పాయలు నూరి కణతలకు పట్టువేస్తే పార్శ్వపు నొప్పి తగ్గిపోతుంది.

★ ఆవు నెయ్యి తింటే ఎక్కిళ్ళు తగ్గుతాయి.

★ రాత్రివేళ చెంచాడు తులసి రసంలో రెండు చుక్కల తేనె కలుపుకొని సేవిస్తే చక్కగా నిద్రపడుతుంది.

- శివానంద్

మువ్వలు

12వ పేజీ తరువాయి

మర్రోజు ఆ ఇంటి పెరటిలో మల్లెపూలలు కడుతూ కూచున్నారు ముగ్గురూ.

'మీ ఇద్దరి ఉద్దేశం ఏవిటీ?' అంది సరళ.

'ఈ విషయంలో నిర్ణయం నీవే తీసుకోవాలనే నేనూ, అమ్మమ్మా అనుకున్నాం. పెళ్లి చేసుకునేది నీవు కదా! నీ ఆలోచనే మా ఆలోచన అవుతుంది.'

అమ్మమ్మ గారు అంది 'పిల్ల వాడు బాగానే ఉన్నట్టున్నాడే. వాళ్లు ఇచ్చిన ఫోటో అమ్మ చూపించింది' సన్నని గాలి మల్లెల సువాసనలతో నిండి వాళ్ల ముగ్గురి మధ్య నిండి ఉండగా సరళ 'అంత డబ్బున్న ఇంట్లో నేను వాళ్లకు కావలసిన కోడలుగా ఉండలేననిపిస్తోంది అమ్మమ్మా. అమ్మ కూడా చూసిది ఆ సంపద. అంత సంపద ఉన్న ఇంట్లో నేనూ ఇబ్బందిగా అయిపోయి ఇరుక్కుపోతానేమో అనిపిస్తోంది' అంది.

కాసేపు ఉండి సరళే అంది 'అబ్బాయి నిజంగానే బావుంటాడు. నా కంటే అతనే ంటాడు. చిన్నప్పటి నుండీ చిక్కటిపాలు, గడ్డ పెరుగు, వెన్న, మీగడ, తేనెలతో పెరిగినట్టు నున్నగా, మెత్తగా ఉంటాడు. నాకు నా జీవితం ఓ రకంగా ఉండాలనిపిస్తుంది, అలా ఉంటేనే నాకు శాంతిగా ఉంటుంది. అశాంతి ఉండకపోవచ్చు కానీ, నేను కోరుకునే శాంతి ఆ ఇంట్లో దొరకదని నాకు అనిపిస్తోంది. వాళ్ల ఆడపిల్లలిద్దరూ బాగా చదువుకున్నా, భర్తలకు భార్యలుగా ఇంట్లోనే ఉంటున్నారు. నాకు ఉద్యోగ జీవితం అంతా చేయాలని ఉంది. చేస్తున్న ఉద్యోగంలోనే జాబ్ సాటీస్‌ఫేక్షన్ కావాలనుకుంటాం కదా జీవితంలో తృప్తిని ఆశించడం అత్యాశ కాదు కదా! నా జీవితంలో తృప్తిగా ఉంటూ శాంతిని పొంది, ఆ స్ఫూర్తితో ఇతరులకు ప్రేమ, ఆత్మీయత, అనురాగం అందించాలని ఉంటుంది నాకు. అక్కడ అతని భార్యగా నా జీవితం ఇరుకుగా అయిపోతుంది. అతనితో జీవించడం వద్దు అనే నా నిర్ణయం'.

'సరే. అలాగే' అని ఆ తల్లీ కూతురు ఆ చిన్న తోటలో చెట్లకు, మొక్కలకు, తీగలకు నీళ్లు పోస్తూ సరళతో మాట్లాడుతూ గడిపేసేరు.

బయలుదేరే రోజున సంధ్య అంది 'అమ్మాయ్! అమ్మమ్మ ఓ నాలుగు రోజులు ఉందమంటోంది. నువ్వు వెళ్లు. అయిదో రోజున నేనక్కడకు వచ్చేస్తానులే'

'అన్న సమయానికి వచ్చేయ్యాలి మరి' అంది సరళ ముభావంగా.

'అలాగే లేవే. నీకు నీ దగ్గర మీ అమ్మ ఉండాలని ఉన్నట్టుగానే మీ అమ్మకు వాళ్ల అమ్మ దగ్గర ఉండాలని ఉండదా ఏవిటి? క్షేమంగా వెళ్లిరా' అంది అమ్మమ్మ నవ్వుతూ.

సరళ బయలుదేరుతూండగా 'నేను వచ్చి స్వామిగారి ఇంట్లో మాట్లాడుతానులే' అంది సంధ్య.

'నీవు చెప్పేరోజు ఉదయాన్నే నేను రాజీనామా ఇస్తాను' అంటూ సరళ బస్ ఎక్కేసింది.

సరళ మామూలుగా మొదటిరోజునే ఆఫీస్ పనిలో మునిగిపోయింది.

రెండో రోజు కాస్త ఖాళీగా ఉన్నప్పుడు శ్రీనివాస్ కేసి చూసింది. అతని నిశ్చలతను చెదరగొడదామన్న చిలిపి ఊహ ఆమెలో రేగింది.

'ఏవండీ - ఆ మధ్య ఎమ్. డి. గారి మనవరాలి పుట్టిన రోజు డిన్నర్ మిస్ చేసేరు - మీ ఊరు వెళ్లేరా?' అంది

'అవునండి'

'పెళ్లి సంబంధాలు చూసారా?'

అతను కాసేపు ఆగి, ఆ తర్వాత 'చూసాను' అన్నాడు.

'ఎన్ని? - ముగ్గురి ఆడపిల్లల్నా?'

'కాదు. ఒక అమ్మాయి...' అని అతను అంటూండగా 'పిల్ల బావుందా? నచ్చిందా?' అంది.

ఆమె అలా అడుగుతుందని అనుకోని శ్రీనివాస్ తమాయించుకొని 'అమ్మాయి బావుందండి' అన్నాడు మీసాల చాటున నవ్వు దాచేస్తూ.

'మరి పెళ్లి ఎప్పుడు? నన్ను పిలుస్తారా?' అంది ఆటపట్టిస్తున్నట్టుగా.

'అంతవరకూ రాలేదు లెండి'

'అంటే - కట్న కానుకులు బేరాలు జరుగుతున్నాయా?' అంది నవ్వుతూ క్విస్తున్నట్టుగా.

'అంతా చెప్పాలంటే చాలా చెప్పాలండీ' అని ఊరుకున్నాడతను.

'అన్నీ చెబుదురు గాని - రేపు రాత్రి మా ఇంటికి డిన్నర్‌కు రండి, రాత్రి ఎనిమిదికి రాగలరు కదూ?'

'మీ ఇంటికి డిన్నరుకా?! వద్దులెండి'

'మీరు రేపు రాత్రి ఎనిమిది గంటలకు భోజనానికి మా ఇంటికి వస్తున్నారు' అనేసి, ఆమె లేచి, ఇంటి చిరునామా ఉన్న విజిటింగ్ కార్డ్ అతనికి అందించి 'ఎమ్.డి.ని కలి ' అని వెళ్లిపోయింది.

మర్రోజు రాత్రి ఎనిమిదికి రెండు నిమిషాల ముందు ఆమె ఇంట్లో 'కాలింగ్‌బెల్' చిలకపలుకులా పలికింది. సరళ తలుపు తీసి గుమ్మానికి కాస్త దూరంగా నిలబడి ఉన్న శ్రీనివాస్‌ని చూసి 'స్వాగతం' అంటూ, అతనిని కూచోబెట్టి, నాలుగు పత్రికలు అతనికి చూపుతూ 'చదువుతూ ఉండండి. పోపు వేసి నేనిప్పుడే వచ్చేస్తాను' అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది'

కాసేపట్లో 'పోపులో ఆ మినప్పప్పు ఇంకో అరనిమిషం వేగేక మిరపకాయలు, మిగతావి, తర్వాత చివరలో కరివేపాకు వేస్తే సమంగా వేగి ఉంటాయి' అని వినిపించి ఆమె తల తిప్పి చూసింది.

శ్రీనివాస్ ఆమె వెనకనే ఉన్నాడు.

'చప్పుడు చేయకుండా పిల్లిలా వచ్చేరే, అయినా పోపు గురించి అంత క్షుణ్ణంగ మీకు ఎలా తెలుసు? శృత పాండిత్యమా!' అంది సరళ పోపు దింపుతూ.

'నేనే నా భోజనం వండుకుంటాను రోజూ'

'అంతేలెండి. ఒక్కరూ ఉంటారుగా. హోటల్‌భోజనం బావుండదు కదా! తప్పక వండుకు తీరాలి గదా' అంది.

'అది కాదులెండి. నా చిన్నప్పటినుండీ వంట నేర్చుకున్నానండీ.''

'అదేవిటి?'

'మా అమ్మ నేర్పించింది. నేను నేర్చుకున్నాను'

ఆమె బుగ్గలు వంట సెగకు కొద్దిగా ఉబ్బి, మరీ ఎర్రగా కందిపోయాయి.

'పది నిమిషాల్లో నేను స్నానం చేసి వచ్చేస్తాను. ఎంగేజ్ యువర్ సెల్ఫ్. ఇప్పుడే వస్తాను' అని ఆమె వెళ్లిపోయింది.

ఆమె వచ్చేటప్పటికి, అతను ఆమె పుస్తకాల 'రేక్' లో పుస్తకాలు చూస్తున్నాడు.

ఆమె 'భోజనం చేసేద్దామా, నేను టేబిల్ సిద్ధం చేస్తాను' అంటూ భోజనాల టేబిల్‌మీద - 'మేట్స్' పెట్టి, వాటి మీద డిన్నర్ ప్లేట్లు, సైడ్ ప్లేట్లు, స్పూన్స్, వంటకాల గిన్నెలపై మూతలు పెట్టి ఉండడం చూసి ఆశ్చర్యపోయినా ఏమీ అనకుండా 'మీరు స్నానం చేస్తారా - నా చీర ఇస్తాను... వంటికి చుట్టుకొని సద్దుకోవచ్చు' అంది.

అతను 'అన్నీ అయిపోయాయండి' అని అతి మామూలుగా అని ఊరుకున్నాడు.

'జోకకు కూడా నవ్వడా ఇతను?' అనుకొని మనసులో కాస్త చిరాకు పడింది.

భోజనానికి టేబిల్ దగ్గరకు వెళ్తూనే శ్రీనివాస్ అన్నీ చాలా నీట్‌గా ప్లేట్లలో సర్దడం మొదలుపెట్టాడు. అతను చేసే పని తీరులో నేర్పు, పరిపూర్ణత ఆమెకు తెలుస్తూనే ఉంది.

'వంట నేను, వడ్డన మీరు, తినడం ఇద్దరమూ అన్నమాట' అంది సరళ నవ్వుతూ.

'మీరు ఆరుగంటలకే రమ్మనమంటే, వంటలో నేనూ సాయంచేసే వాణ్ణి' అని ఊరుకున్నాడు అతను.

భోజనం చేస్తూ, అతను పదార్థాలన్నీ ఎంత రుచిగా ఉన్నాయో చెబుతూ, నెమ్మదిగా, తృప్తిగా తింటూ ఆమెకు పెరుగు వడ్డిస్తూ 'మా అమ్మ వండినవి కూడా ఇంత రుచిగానూ ఉండేవి' అన్నాడు. అతను ఆ మాటలు అంటున్నపుడు అతని కళ్లల్లో చెమ్మ ఊరిందా అని ఆమెకు అనిపించింది.

'నిన్న ఆఫీసులో చాలా విషయాలు చెప్పాలన్నారు.

ఇప్పుడు చెప్పండి' అంది.

అతను చేతులు కడుక్కొని, తుడుచుకుని, ఖాళీ ప్లేట్లు తీసి 'కిచెన్ సింక్' లో ఉంచి వచ్చి, డ్రాయింగ్ రూమ్‌లో కూచున్నాడు.

రెండు నిమిషాలలో ఆమె వచ్చి, అతనికి ఎదురుగా కూచుని 'బతిమాలితే కాని విషయాలు చెప్పరేవిటి? నాకు బతిమాలడం, బతిమాలించుకోవడం అలవాటు లేదు. సరే లెండి! - మీ గుట్టు మీ దగ్గరే ఉంచుకోండి' అని, ఆమె రెండు పుస్తకాలు తీసుకు వచ్చి 'మీకు సాహిత్యం ఇష్టమేనా?' అంది.

అతను ఆ పుస్తకాలు చూడకుండానే 'మా నాన్నకు ఇద్దరు భార్యలండి. మా దొడ్డమ్మ పోయాక మా నాన్న మా అమ్మను చేసుకున్నాడు. దొడ్డమ్మకు ఇద్దరు పిల్లలు - అక్కయ్య, అన్నయ్య. మా అమ్మకు నేను ఒక్కణ్ణే. అక్కయ్య, బావగారు భోపాల్‌లో ఉంటారు. అన్నయ్య వ్యవసాయం, వ్యాపారం చూసుకుంటాడు మా ఊళ్లో. మా వదిన చాలా మంచిది, మా అమ్మలా. మా నాన్నకు నేను ఏనాడు చేరువకాలేకపోయాను. ఆయన ధాష్టీకం ఆయనను నాకు దూరం చేసేసింది. మా అన్నయ్యదీ అదే తీరు. పదిహేనేళ్ల క్రితం మా నాన్న పోయాడు. మా అమ్మే నాకు అన్నీ అయింది. నాకు చదువు నడత, వంట, అల్లికలు, కుట్లూ, అలంకరణ - అన్నీ నేర్పింది. నేను అవి అన్నీ చాలా ఇష్టంగా చేర్చుకున్నాను - మా అమ్మ మీద ఇష్టంతో' అన్నాడు.

'మీ అమ్మగారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? మీ ఊళ్లోనా?' అంది సరళ.

'అక్కడ' అతను కుడి చేయి చూపుడు వేలు ఆకాశం వేపు చూపించేడు.

చెప్పేది ఎవరి విషయమో అన్నట్టు అతను చాలా మామూలుగా చెబుతున్నా, అతను మాటలు పలికే తీరులో, కళ్లల్లో సన్నటి బాధ వీచిక లీలగా మెదిలిందా? అనుకుంది సరళ.

తన బాధ, దిగులు ఎవరితోనూ అతడు పంచుకోడని ఆమెకు తెలిసింది. మరో పక్క ఇతరులను ఆర్ద్రతతో ప్రేమాస్పదంగా గౌరవించే సుగుణం అతనిలో ఉందనీ ఆమె గుర్తించింది.

తల్లి విషయంగా అతనిలో వచ్చిన మార్పునీ దాచుకుంటున్న విషాధాన్ని తగ్గిద్దామని ఆమె 'ఇంతకీ పెళ్లి చూపుల విశేషాలు, పెళ్లి కూతురి గురించి చెప్పండి' అంది.

''మా అన్నయ్య ఎవరో ఓ అమ్మాయితో నా పెళ్లి కానిచ్చేసి బాధ్యత తీర్చేసుకుని చేతులు దులిపేసుకొందామని అనుకుంటున్నాడని నాకు తెలుసు'

'మీ కాబోయే శ్రీమతి గురించి చెప్పండి బాబూ. సిగ్గా?' అంది.

'సిగ్గెందుకండి. అమ్మాయి గ్రాడ్యుయేట్. ప్రైవేటుగా డిగ్రీ చేసినట్టుంది. పెళ్లి చూపులకు నేను వెళ్లనన్నాను. వెళ్లలేదు. నాకు చెప్పకుండా తెచ్చిన ఆ అమ్మాయి ఫోటో చూపించేరు. ఫోటోలో బాగానే ఉంది ఆ అమ్మాయి'

'నా కంటేనే;' అంది సరళ ఉన్నట్టుండి అనాలోచితంగా.

అతను చిరునవ్వు నవ్వి గుబురు మీసాల చాటున దాచేసుకున్నాడు.

'నవ్వడు కానీ, నవ్వితే బావుందే' అని ఆమె మనసులో 'నోట్' చేసుకుంది.

'ఆ 'సిట్ అవుట్' లో కూచుందామా? ఇంటికి వెళ్లిపోవాలా?' అంది సరళ.

'పదకొండు దాటేక అన్నయ్య ఫోన్ చేస్తానన్నాడు. మీకు ఇబ్బంది కాకుండా ఉంటే మీ ఇష్టం.'

ఇద్దరూ నక్షత్రాల గొడుగు కింద కూర్చున్నారు.

మాట్లాడుకుంటూండ గా ఆమె రెండు కవితా సంపుటులు తీసుకు వచ్చి 'మీరు కవిత్వం చదువుతారా?' అంది.

అతను ఓ పుస్తకం చూస్తూ 'ఈమెకు తెలీదు కదా! అది కలం పేరుతో తన రాసిన కవితల సంపుటి అని. అయినా చెప్పడం ఎందుకు?' అనుకొని 'సాహిత్యం చదువుతాను ఇష్టం' అని ఊరుకున్నాడు.

ఇంతలో ఇంట్లో లైట్లు పోయాయి. ఆమె లేచి పక్కనే ఉంచుకున్న బాటరీ లైట్ సాయంతో ఇంట్లోకి వెళ్లి, 'మెయిన్' లో కొత్త ఫ్యూజ్ వేసి దీపాలు వెలిగించింది. పెద్ద దీపాలు బదులు గదుల్లో నీలపు కాంతితో వెలిగే చిన్న బల్బులు మాత్రం ఉంచి 'సిట్ అవుట్' లోకి వచ్చి కూచుంది.

ఆమెకు అమ్మ గుర్తుకు వచ్చింది.

ఆమె నెమ్మదిగా, అమ్మ, అమ్మమ్మ గురించి, నాన్న హఠాత్తుగా పోవడం, మావయ్య దూరంగా వెళ్లిపోవడం, ఆ తరవాత తన పెంపకం కోసం, అమ్మ లెక్చరర్ ఉద్యోగం మానేయడం - అన్నీ చెబుతుండగా...గాలి చల్లగా అయిపోయింది.

అతను లేచి నులుచుని 'నేను వెళ్తాను' అన్నాడు.

'సరే'

చూస్తుండ గానే నక్షత్రాలు కరిగిపోతూ మాయమైపోయాయి. నల్లటి మేఘాలు అలుముకోడం, సన్నటి జల్లు వాళ్లనిద్దరినీ తడపడం ఉన్నట్టుండి వర్షం సూదుల్లా గుచ్చుకోవడం, ఆకాశాన్ని చీల్చిన తటిల్లత మెరుపులో వర్షం వెలిగి వెండి దారాల్లా కిందికి దిగుతూ భూమినీ, ఆకసాన్నీ కలిపి వేయడం... చిటికలో జరిగింది.

ఇద్దరూ లోపలికి వచ్చేరు.

అతను చట్టున ఆ వర్షంలో బాల్కనీలోకి వెళ్లి కుర్చీలు, దిళ్లు లోపలికి తీసుకు వచ్చేడు.

అతను తడిసి ముద్దయిపోయాడు.

ఆమె అందించిన టవల్‌తో తుడుచుకున్నాడు.

మీ బట్టలన్నీ తడిసిపోయాయి. మీకు చీర చుట్టుకునే యోగం తప్పేట్టు లేదు - నా చీర తెస్తా నుండండి' అంటూ ఆమె బెడ్ రూంలోకి వెళ్లింది. 'వద్దండి' అంటూ అతను లోపలికి వెళ్లేడు.

వర్షపు జోరు ఎక్కువైంది. వేడెక్కి ఉన్న గాలి, భూమి వర్షపు ధారలలో తడిసిపోతూ, వేడి కరిగి, నీటి చల్లదనంతో మొదట్లో వేడిగా, తరువాత వెచ్చగా, క్రమంగా, సువాసనలతో నిండుతోంది.

అప్పటి దాకా వేడిగా ఉక్కతో నిండివున్న ప్రకృతి చల్లబడుతూ, వర్షపు జలధారలతో చెట్లు ప్రాణవంతమవుతూ, ఉధృతంగా ఊపేస్తున్న గాలుల విసురులకు ప్రకృతిలో ఆనందం నిండి శాంతిస్తోంది.

నెమ్మదిగా ఓ రెండు గంటలకు వర్షం తగ్గి పుడమి, ప్రకృతి, ఆకాశం, గాలి, నీరు ఆనందపు పూర్ణమయి తన్మయస్థితికి చేరి ప్రశాంతం నిండింది.

ఆమె ఆ మత్తు వీడుతూండగా, తన మంచం మీదకు ఎలా చేరిందో, తన ఈ స్థితిలోకి ఎలా వచ్చిందో గుర్తు తెచ్చుకుందామనుకుంటూండగా, ఆమెను నిదుర మళ్ళా మైకంలోకి జార్చేస్తూంటే, పక్కన ఉన్న అతనిని అరమోడ్పు కళ్లతో చూస్తూ 'నన్ను నిదుర కమ్మేస్తోంది. మీరు వెళ్లిపోతే, ఆ తలుపు తీసుకుని దగ్గరగా మూసి వెళ్లిపోండి. ఇక్కడ నా దగ్గర ఉండిపోవాలనిపిస్తే... ఉండు' అంటూ గాఢమైన నిదురలోకం లోకి నిండుగా, తృప్తిగా జారిపోయింది.

★★★

పిట్టలు కూస్తున్నాయి. తెరచిన కిటికీలో నుండి చల్లని గాలులు ఆమెను తాకుతున్నాయి. కిటికీని నిండి ఉన్న ఆకసం తెల్లగా, స్వచ్ఛంగా, చల్లగా ఉంది. కిటికీలో నుండి తెల్లవారుజాము వెన్నెల పాకి మంచాన్ని కప్పుతూ, ఆమెను నిండి ఉంది.

పక్కన ఖాళీగా ఉండడం గమనించి 'వెళ్లిపోయి ఉంటాడు' అనుకుంటూండగా, కింద నేలమీద కూర్చుని, మంచం పట్టె మీద ఆన్చిన వదనాన్ని రెండు అర చేతులలో బిగించి, తన వేపు దీక్షగా, ఇష్టంగా చూస్తున్న అతని ఆ రెండు ఆకుపచ్చ కళ్ల వెలుగు తనని నింపుతున్నట్టుగా ఆమెకు తెలిసింది.

వచ్చేవారం కథ

గజ ఈతరాలు

- గొరుసు జగదీశ్వర రెడ్డి